ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులు
పెండింగ్ లేకుండా చూడాలి : కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 7 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి, చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియపై బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి మున్సిపల్, కుడా, జిల్లా పంచాయతీ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు, కారణాలు, పరిశీలనకు ఎన్ని బృందాలు ఏర్పాటు చేశారు? పరిశీలనలో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్ప్ డెస్క్‌ల ద్వారా ఎల్ఆర్ఎస్ పేమెంట్‌పై అవగాహన కల్పించాలన్నారు. పేమెంట్ జరిగిన రెండు రోజుల్లో ఎల్ -1 దశ నుంచి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు.

తాగునీటి సరఫరాపై సమీక్ష..

జిల్లాలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్షించారు. గ్రేటర్ వరంగల్, పరకాల మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. సమావేశంలోమిషన్ భగీరథ ఈఈ మల్లేశం, కుడా పీవో అజిత్‌రెడ్డి, సీపీవో రవీందర్, డీఎల్పీవో గంగ భవానీ పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ హైదరాబాద్ నుంచి ఎల్ఆర్ఎస్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 82,332 దరఖాస్తులు రాగా, అందులో 29,517 ఆమోదించామని, 3,089 దరఖాస్తులకు చెల్లింపు చేయగా, మిగిలినవి ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి, త్వరలో దరఖాస్తులు పరిశీలించి పూర్తి చేస్తామని తెలిపారు. గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ, డీపీవో లక్ష్మీరమాకాంత్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

ఎల్కతుర్తి, మార్చి 7 : మండలంలోని పలు గ్రామాల్లో రోజురోజుకూ కుక్కకాటు బాధితులు పెరుగుతున్నారు. దండేపల్లికి చెందిన సట్ల తిరుమల్, పెంచికల్‌పేటకు చెందిన ముప్పు మొగిలి, బొనగాని సంతోష్, మైస శ్రీనింద్రతో పాటు మరో నలుగురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. అలాగే గోపాల్‌పూర్‌కు చెందిన ఎండీ నజీమాను కోతి గాయపర్చింది. పెంచికల్‌పేటలో కుక్కలు పదుల సంఖ్యలో పశువులను సైతం గాయపరుస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీధుల్లోకి వెళ్లాలంటే భయపడిపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

వంగపల్లిలో రెండు ఇళ్లల్లో చోరీ

కమలాపూర్, మార్చి 7 : మండలంలోని వంగపల్లి గ్రామంలో దేవరాజు భద్రయ్య, దేవరాజు శంకరయ్య ఇండ్లల్లో చోరీ జరిగినట్లు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. భద్రయ్య ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో చూడగా వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. దుండగులు తులం బంగారం ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న దేవరాజు శంకరయ్య ఇంట్లోకి చొరబడి రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. చోరీ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వగా, క్లూస్ టీం సభ్యులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు.

పశు వైద్యాధికారి క్రాంతిపై విచారణ

హసన్‌పర్తి, మార్చి 7 : మండల కేంద్రంలో పశు వైద్యాధికారి క్రాంతికుమార్ రైతుల వద్ద డబ్బులు తీసుకొని వైద్యం చేస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం జిల్లా పశు వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రైతులతో మాట్లాడారు. నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు సమర్పిస్తామన్నారు. కార్పొరేటర్ శివకుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు మారం తిరుపతి, నాయకులు మారపల్లి రాంచంద్రారెడ్డి, పెద్దమ్మ శ్రీనివాస్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- సమస్యలు ఎదురైతే ధైర్యంగా పోరాడాలి
- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, టీజీవో నేతలు

హనుమకొండ, మార్చి 7 : ప్రస్తుతం మహిళలు విభిన్న రంగాల్లో రాణిస్తున్నారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్లు, పోలీస్ తదితర ఉద్యోగాలు మొదలుకొని ఆకాశం వరకు మహిళలు అనేక అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఎన్నో అవరోధాలు దాటి ఉన్నత స్థానంలో నిలిచిన మహిళా అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతి మహిళా ఒక రోల్ మోడల్ అన్నారు. టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఉత్సాహం నిండుతుందన్నారు. అనంతరం వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి , కలెక్టర్‌ను సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, మహిళా అధికారులు నీరజ, అనురాధ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం..

హనుమకొండ/ఆత్మకూరు/హసన్‌పర్తి/పరకాల/హనుమకొండ చౌరస్తా : బాలసముద్రంలోని శ్రీనివాసనగర్ కాలనీలో యెలుగం ఫౌండేషన్ (ఎల్అండ్ఎన్) ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఫౌండేషన్ సెక్రటరీ యెలుగం పూర్ణకళ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం అభినందనీయమన్నారు. అలాగే సీనియర్ సిటిజన్ గడంగి వీణాకుమారి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయురాలు అనిత మాట్లాడుతూ.. మహిళా లోకం ఉన్నత శిఖరాలను చేరుకొని పురుషులకు తామేమి తీసిపోమని చాటిచెప్పారన్నారు. అనంతరం మహిళలను సన్మానించారు. యెలుగం నర్సయ్య, బూర రామస్వామి పాల్గొన్నారు. ఆత్మకూరు ఎంపీపీఎస్, పెద్దాపురం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పెండెం రాజు, మాడ భిక్షపతి మహిళా ఉపాధ్యాయురాళ్లను సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఉపాధ్యాయులు నరసింహస్వామి, ఉషారాణి, అనిత, అనురాధ పాల్గొన్నారు. అలాగే మండలంలోని మహిళా పంచాయతీ సెక్రటరీలను మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రాజు, కార్యదర్శులు శ్వేత, అనూష, సృజన, అరుణ, కల్యాణి, అమిత, సంధ్య, లావణ్య, సంపూర్ణ పాల్గొన్నారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని సుమతీరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఎంటర్‌ప్రెన్యూయల్ వీక్‌లో భాగంగా వివిధ కంపెనీలకు చెందిన సీఈవోలు పాల్గొని ఎంటర్‌ప్రెన్యూయర్‌గా ఎదగడానికి కావాల్సిన పరిజ్ఞానం, టెక్నాలజీ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు పోస్టర్ ప్రెజంటేషన్, డాన్స్, ఫ్యాన్సీ డ్రెస్, క్రాఫ్ట్, ఎక్స్‌పోపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, కోఆర్డినేటర్ ఝాన్సీరాణి, సుదర్శన్, మహేంద్రశర్మ, శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు. ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు పరకాల ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. పంచాయతీ రాజ్ ఏఈ శ్రీలత, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శైలశ్రీ, టీఏ సుమలత, పంచాయతీ కార్యదర్శులు సుమలత, రిజ్వానా, సీవో అనిత, ఎఫ్ఏ కోమల పాల్గొన్నారు. కేయూ మైదానంలో రాణిరుద్రమ మహిళా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు రన్నింగ్, నడక, మ్యూజికల్ చైర్, సూదిలో దారం, చెంచా పరుగు తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. పోటీలను అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్ చీఫ్ దేశిని లక్ష్మీనారాయణ, కేయూ వాకర్స్ సంఘం అధ్యక్షుడు దగ్గల శంకర్, ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి ప్రారంభించారు. విజేతలకు శనివారం కేయూ బాస్కెట్‌బాల్ మైదానంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు రాణిరుద్రమ మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వజ్ర తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వేడుకలకు జిల్లా నుంచి రెండు బస్సుల్లో వంద మంది వెళ్లనున్నారని డీఆర్డీవో మేన శ్రీను తెలిపారు. 12 మండలాల్లోని ఒక్కో మండల సమాఖ్య నుంచి ఐదుగురుతో పాటు ఇన్‌చార్జిలు, మెప్మా నుంచి సుమారు 30 మంది తరలివెళ్లనున్నారు.

హనుమకొండ : మహిళలను సన్మానిస్తున్న యెలుగం ఫౌండేషన్ సభ్యులు


హసన్‌పర్తి : విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

ఆర్టీసీ బస్సు-లారీ ఢీ

హసన్‌పర్తి, మార్చి 7 : ఆర్టీసీ బస్సు లారీ ఢీ కొన్న ఘటన హసన్‌పర్తిలో శుక్రవారం జరిగింది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. వరంగల్-1 డిపో బస్సు నిజామాబాద్ వెళ్తుండగా, హసన్‌పర్తి స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ బస్సు కుడివైపు భాగంలో ఢీకొన్నది. బస్సులో 52 మంది ప్రయాణికులు ఉండగా, ఎవరికీ గాయాలు కాకపోడంతో ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేవాదుల నీటితో చెరువులు నింపాలి

ఐనవోలు, మార్చి 7 : మండల వ్యాప్తంగా ఉన్న చెరువులను దేవాదుల నీటితో నింపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వనమాలకనపర్తి, నాగపురం, కొండపర్తి, గుంటూరుపల్లి గ్రామాల్లో సీపీఎం ప్రతినిధులు నీళ్లు లేక ఎండుతున్న మక్కజొన్న, వరి, కూరగాయల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, నాగరాజు, ఉప్పలయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను

jobs Apply Now!

★ వరంగల్‌లో ఇంట్లో ఉండి పనిచేయుటకు భార్య, భర్తలు కావలెను. జీతం ఇద్దరికి కలిపి 18,000/- + ఉచిత రూమ్, ఉచిత కరెంట్ సంప్రదించండి. సెల్: 9849910111.
NTW-17524

WANTED
★OT-TECHNICIANS (Exp.), PHARMACY (Exp.), LAB-TECHNICIANS (Exp.), DHOBI Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm.
NTW-488

WANTED TEACHERS
★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

CHANGE OF NAME
I, HAFSA KULSUM R/o. H.No.30-2-968, Nehrunagar, Madikonda Village, Kazipet Mandal, Hanumakonda Dist., 506 142, My name Changed from GAJAWELLI SHIRISHA to HAFSA KULSUM for all purposes.

పేరు మార్పు
నా పేరు లిక్కి నాగరాజు, గ్రామం గాంధీనగర్, ఇంటి నెంబర్ 7-179/2, మండలం గోవిందరావుపేట, ములుగు జిల్లా వాసిని. పిన్ కోడ్ : 506347. నా కుమార్తె పేరు ఇంతక ముందు లిక్కి వైష్ణవి అని ఉన్నది. ఈ పేరును లిక్కి ఆశ్రీతగా మార్చబడినది. కుమార్తె వయసు 10 సంవత్సరాలు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కేఎంసీ హాస్టల్ కార్మికుల సమ్మె

వరంగల్ చౌరస్తా, మార్చి 7 : కాకతీయ మెడికల్ కళాశాల హాస్టల్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. శుక్రవారం కేఎంసీ ఆవరణలో కార్మికులు సమ్మె నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి యాదనాయక్ మాట్లాడుతూ.. 8నెలలుగా సిబ్బంది వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే విధులు బహిష్కరించి సమ్మెకు దిగామన్నారు. వేతనాలు సమయానికి అందక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు అందించాలని, లేకపోతే ఉద్యోగ, ప్రజా, కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మె ఉధృతం చేస్తామన్నారు. కాగా, విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రావీణ్య అక్కడికి వెళ్లి కార్మికులతో మాట్లాడి పెండింగ్ వేతనాలు వెంటనే అందించడానికి కృషి చేస్తానని, సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని కోరడంతో యూనియన్ నాయకులు స్పందించి సమ్మెను తాత్కాలికంగా రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సుధాకర్, అల్లం రమేశ్, ప్రశాంత్, రాజకుమారి, రాము, కోమల, యాకయ్య, ప్రకాశ్, కవిత, బాబు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

శివకృష్ణ (ఫైల్)

కాజీపేట, మార్చి 7 : మద్యానికి బానిసై క్షణికావేశంతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మడికొండ శివారులో శుక్రవారం వెలుగు చూసింది. కాజీపేట జీఆర్పీ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ ఎస్సీ కాలనీకి చెందిన వస్కుల శివకృష్ణ (37) తాగుడుకు బానిసయ్యాడు. కూలి పనులు చేసి ప్రతిరోజు మద్యం తాగుతూ ఇంటికి వచ్చేవాడు. గురువారం రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో మద్యం మత్తులో ఉన్న శివకృష్ణ ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. అయోధ్యపురం- కుమ్మరిగూడెం రైల్వే గేట్ మధ్య అర్ధరాత్రి సికింద్రాబాద్ నుంచి మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి వరంగల్ ఎంజీఎం దవాఖానలో పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అతడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి

కాజీపేటలో మహిళలతో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కాజీపేట, మార్చి 7 : దేశంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టి, మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమిడి నుంచి రైల్వే స్టేషన్ వరకు శుక్రవారం మహిళలు ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్, మైక్రో ఫైనాన్స్‌ల వల్ల అప్పులు విపరీతంగా పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్, జాతీయ ఆరోగ్య మిషన్ మొదలైన కేంద్ర పథకాల్లో అత్యధికంగా మహిళలే పని చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తున్నదన్నారు. అరికిల్ల వెంకటస్వామి, విద్యాసాగర్, సుధాకర్, హంస, సువర్ణ, రమా, రేణుక పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు తోడ్పాటు

కాజీపేట, మార్చి 7 : క్రీడలు, సాంస్కృతిక పోటీలు మానసిక ఉల్లాసానికి తోడ్పడుతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని రామన్ హైస్కూల్‌లో ట్రస్మా ఉమ్మడి జిల్లా సాంస్కృతిక, క్రీడా పోటీలు ప్రారంభించారు. మీట కన్వీనర్ హనుమకొండ ట్రస్మా అధ్యక్షుడు సతీశ్‌కుమార్, బాధ్యులు నారాయణరెడ్డి, భూపాల్‌రావు, వరంగల్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ ట్రస్మా అధ్యక్షులు నాగార్జునరెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరమల్లు, సాంబయ్య, దేవేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ రామన్ గ్రూప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేశ్‌కుమార్, గిరిధర్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

కాజీపేట, మార్చి 7 : పట్టణంలో శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యా. మడికొండ నుంచి కాజీపేటకు వెళ్తున్న ఆటో బాపూజీనగర్‌లో బోల్తా పడింది. ఈ ఘటనలో వెంకటేశ్, శ్రీధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని 108 వాహనంలో చికిత్స కోసం దవాఖానకు తరలించారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 7 : విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని డీఈవో వాసంతి అన్నారు. కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్లో నేషనల్ గ్రీన్ కార్ప్స్, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన పర్యావరణ హిత సబ్బుల తయారీ కార్యశాలలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలుగని రీతిలో సబ్బులను తక్కువ ఖర్చులో తయారు చేయడం ఎలాగో ఈ కార్యశాలలో విద్యార్థులకు నేర్పిస్తారన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం

హనుమకొండ చౌరస్తా, మార్చి 7 : శ్రీరస్తు వెడ్డింగ్‌మాల్, కల్యాణలక్ష్మి షాపింగ్‌మాల్ చాలా సంవత్సరాల నుంచి పనిచేస్తున్న 100మంది కార్మికులకు లేబర్ చట్టం ప్రకారం సర్వీసు, బోనస్, బకాయి పీఎఫ్ జమ, ఇతర లావాదేవీలు యజమాన్యం వెంటనే చెల్లించకపోతే ఆందోళన చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి హెచ్చరించారు. శుక్రవారం శ్రీరస్తు వెడ్డింగ్‌మాల్, కల్యాణలక్ష్మి షాపింగ్‌మాల్ ఎదుట 2వ రోజు కార్మికులు ధర్నా చేపట్టారు. కార్మికులు పనిచేసిన కాలానికి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. ధర్నాలో వెంకటేశ్వర్లు, వెంకట్‌నారాయణ, నాగరాజు, రమేశ్, జయ, రాధిక, రమాదేవి, లావణ్య పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు

శాయంపేట, మార్చి 7 : మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ రంజిత్‌రావు, ఎస్సై పరమేశ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని గోవిందాపూర్ మాజీ సర్పంచ్ చింతనిప్పుల భద్రయ్యపై రెండు రోజుల క్రితం రాత్రి వేళ ఇంటి వద్ద ఉండగా, అదే గ్రామానికి చెందిన బొత్త శ్రావణ్‌కుమార్, కుమారస్వామి గొడ్డలితో దాడి చేశారు. భద్రయ్యతో ఉన్న గెట్టు పంచాయితీ నేపథ్యంలో నిందితులకు భద్రయ్యపై దాడి చేయాలని శ్రీశైలం ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో శ్రావణ్‌కుమార్, శ్రీశైలంను అరెస్టు చేసినట్లు తెలిపారు. కుమారస్వామి పరారీలో ఉన్నట్లు చెప్పారు. నేరానికి ఉపయోగించిన గొడ్డలి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనకు పోలీసులు సతీశ్, ఖలీద్, శ్రీధర్, హోంగార్డు చందు కృషి చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరివి కక్షా రాజకీయాలు

- ప్రజలను హింసిస్తే సహించేది లేదు
- తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చిలుక ప్రవీణ్

ధర్మసాగర్, మార్చి 7 : ఎమ్మెల్యే కడియం శ్రీహరి కక్ష రాజకీయాలకు పాల్పడుతున్నాడని తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చిలుక ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీహరి జానకీపురం గ్రామానికి చెందిన కుర్సపల్లి రమేశ్‌ను ధర్మసాగర్ సీఐ, ఎస్సైతో కొట్టించారని, ఒక దళితుడు అని చూడకుండా కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడన్నారు. అధికార దుర్వినియోగం చేస్తున్నాడని, కక్ష సాధింపు తప్ప నియోజకవర్గంలో సమస్యలు లేనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎండకాలంలో పంటలకు సాగునీళ్లు లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. సమావేశంలో తెలంగాణ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక వినోద్, మండలాధ్యక్షుడు చిలుక కిశోర్, కిరణ్, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చిలుక ప్రవీణ్

'ఉన్నత విద్యలో స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలి'

హనుమకొండ చౌరస్తా, మార్చి 7 : ఉన్నత విద్యలో స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలని మానవ హక్కుల వేదిక నాయకురాలు పద్మజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ అధ్యక్షతన హనుమకొండ కనిష్క మహిళ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. సమానమైన సామాజిక భాగస్వామ్యం దక్కాలంటే ఉన్నత విద్యలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్నారు. ప్రముఖ మహిళా సామాజిక కార్యకర్త రమాదేవి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బాదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు హనుమాన్‌ప్రసాద్, వెంకటనారాయణ, విద్యార్థి నాయకుడు అర్షం శ్రీనివాస్ ప్రసంగించారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత

వరంగల్ చౌరస్తా, మార్చి 7 : కాకతీయ మెడికల్ కళాశాల అనాటమీ విభాగానికి తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్థివదేహం అప్పగించారు. శుక్రవారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ ఆశ్రమ నివాసి సంజీవకుమార్ (80) గుండెపోటుతో మృతి చెందగా, నిర్వాహకులు యాకూబీ, చోటేమియా సహకారంతో అసోసియేషన్ ప్రతినిధులు పార్థివదేహాన్ని కేఎంసీకి తరలించారు. మరణానంతరం దేహదానం చేయాలనుకునే వారు 8790548706, 9490133650 నంబర్లలో సంప్రదించాలని అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి తెలిపారు.

యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి కాపాడుకోవాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 7: దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన యూజీసీ నూతన ముసాయిదా దేశ సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని, విద్యారంగంపై వివిధ రాష్ట్రాలకు కల్పించిన హక్కులను క